# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-04-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాజ్యాంగ 131వ సవరణ 2026 బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన 2026 బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం.**

2. **దేశ మహిళలు నాయకత్వం వహించేలా కేంద్ర ప్రభుత్వం నారీ శక్తి వందన అధినియం బిల్లును తెస్తోందన్న ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్**

3. **కర్నూలు రహదారి ప్రమాద ఘటనపై విచారం వ్యక్తం చేసిన రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి.**

4. **జనగణనలో భాగంగా చేపట్టే గృహ గణనకు ప్రజలు సహకారం అందించాలని సూచించిన మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి.**

==========================

మూడు రోజుల ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభమైయ్యాయి. ఇందులో భాగంగా లోక్‌సభలో రాజ్యాంగ నూట ముప్పై ఒకటవ సవరణ 2026 బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన 2026 బిల్లులను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ ప్రవేశపెట్టగా, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ 2026 బిల్లును హోం మంత్రి అమిత్ షా సభలో ప్రతిపాదించారు. అనంతరం వీటిని సభలో ప్రవేశపెట్టేందుకు చర్చ చేపట్టారు. ఈ బిల్లులను వ్యతిరేకించిన విపక్షాలు.. ఓటింగ్‌కు పట్టుబట్టగా అందుకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు. ఓటింగ్ నిర్వహించగా.. బిల్లులను ప్రవేశపెట్టేందుకు మద్దతుగా 251 ఓట్లు పోలయ్యాయి. 185 మంది దీనికి వ్యతిరేకంగా ఓటేశారు. మెజార్టీ సాధించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కేంద్ర ప్రభుత్వం ఈ మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. వీటిపై లోక్ సభలో చర్చ కొనసాగుతోంది.

--------------------------

స్త్రీశక్తిని గౌరవిస్తూ దేశ మహిళలు నాయకత్వం వహించేలా కేంద్ర ప్రభుత్వం “నారీ శక్తి వందన అధినియం” బిల్లును తెస్తోందని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అన్నారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ ఈ రోజు స్పందించారు. చెస్ బోర్డు నుంచి ఒలింపిక్ క్రీడల వరకు భారతీయ మహిళలు దేశానికి స్ఫూర్తిని అందిస్తున్నారని తెలిపారు. ప్రతిభకు అవకాశం లభిస్తే మహిళలు నాయకత్వం వహిస్తారని, రాణిస్తారని, దేశాలకు స్ఫూర్తినిస్తారని చరిత్ర

చెబుతోందని అన్నారు. ఈ స్ఫూర్తితోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రప్రభుత్వం 'నారీ శక్తి వందన అధినియమ్' సవరణ బిల్లు 2026ను తీసుకువస్తోందని తెలిపారు.

------------------------------

కర్నూలు జిల్లా చిలకలడోన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి సహాయనిధి నుంచి ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రెండు లక్షల రూపాయలు, క్షతగాత్రులకు 50 వేల రూపాయల పరిహారాన్ని ప్రధానమంత్రి ప్రకటించారు.

ఈ ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. బొలెరో-లారీ ఢీకొన్న ప్రమాదంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కర్ణాటకకు చెందిన వాహనం మంత్రాలయం దర్శనానికి వస్తుండగా తెల్లవారుజామున ప్రమాదం జరిగిందని, 8 మంది మృతి చెందారని అధికారులు వివరించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రోడ్డు ప్రమాదంపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పందిస్తూ, ప్రయాణికులు రహదారి భద్రతా నియమాలు పాటించాలన్నారు. సురక్షిత ప్రయాణం కోసం ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

------------------------------

మత్స్యకారుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని ఎన్డీయే ప్రభుత్వ హయాంలో 10 వేల రూపాయల నుంచి 20 వేల రూపాయలకు పెంచామని.. ఏడాదిలోనే 242 కోట్ల రూపాయలకు పైగా సాయం అందించామని వివరించారు. మత్స్యకారుల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు మరపడవలకు డీజిల్ పై లీటరుకు 9 రూపాయల రాయితీని అందిస్తున్నామని తెలిపారు. మత్స్యకారుల భద్రత కోసం ట్రాన్స్ పాండర్లు అమర్చడం, చేప పిల్లల విడుదల, లోతు సముద్రపు చేపల వేటపడవల పంపిణీ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. తీర ప్రాంత గ్రామాల అభివృద్ధి, ఫిషింగ్ హార్బర్లు, దిగుమతి కేంద్రాల నిర్మాణం ద్వారా మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని మంత్రి వివరించారు.

------------------------------

విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి సంబంధించిన పలు అంశాలపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఈరోజు సమీక్ష నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో ఈరోజు జరిగిన సమావేశంలో విశ్వవిద్యాలయానికి రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్ విస్తరణ, ఔషధ తయారీ, అభివృద్ధి కేంద్రం - DMDC స్థాపన, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో క్రీడా మైదానం అభివృద్ధి, పరిశోధన ప్రాజెక్టుల ప్రస్తుత స్థితి, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ల అభివృద్ధి వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాన్ని విద్యా, పరిశోధన, సదుపాయాల పరంగా మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

------------------------------

జనగణనలో భాగంగా చేపట్టే గృహ గణనకు ప్రజలు సహకారం అందించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. జనగణన-2027లో భాగంగా ప్రకాశం జిల్లా తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన తన వివరాలను స్వీయ గణన ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఈ రోజు నమోదు చేసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 3వేల 255 బ్లాకుల్లో జనగణన కార్యక్రమం జరుగుతుందన్నారు.స్వీయ గణనలో భాగంగా వివిధ వర్గాల ప్రజలు తామే స్వయంగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకుకోవచ్చని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..25.. సెకన్లు

---------------------------

చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి వందన్ అధినియం' గొప్ప నిర్ణయమని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ అన్నారు. విజయవాడలో ఆయన ఈ రోజు మాట్లాడుతూ, ఈ చట్టం ద్వారా దేశ రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం మరింత బలపడుతుందన్నారు.మహిళా సాధికారత అనేది ఒక నినాదం కాదని, దేశాభివృద్ధిలో అది ఒక భాగమని తెలిపారు. మహిళా బిల్లు ఆమోదంతో భారత్ ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య దేశంగా నిలుస్తుందని తెలియజేస్తూ,

వాయిస్ ..30..సెకన్లు

---------------------------

అనంతపురం జిల్లాలో వారం రోజులపాటు అగ్ని ప్రమాదాల నివారణ చర్యల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస రెడ్డి తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అనంతపురంలోని స్థానిక కళాశాలలో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు చేయవలసిన ముఖ్యమైన పనులపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగేలా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు.

---------------------------

పిల్లలు, మహిళలలో పోషకాహార లోపాన్ని అరికట్టడానికి, ఆరోగ్యకరమైన పోషకాహారాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 8వ పోషణ పక్షోత్సవాలు తిరుపతిజిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని 2 వేల 492 అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై తల్లిదండ్రులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. పిల్లలకు ఎలాంటి పోషకాహారాన్ని అందించాలి, ఎలాంటి ఆహారాన్ని తీసుకోవాలి అనే విషయాల్ని తెలియజేస్తున్నారని తిరుపతి జిల్లాకు చెందిన లబ్ధిదారు షర్మిల తెలియజేస్తూ,

వాయిస్..20.. సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 133 వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు